క్లుప్తంగా

పారిశుధ్య పనుల తనిఖీ


పారిశుధ్య నిర్వహణను పరిశీలిస్తున్న కమిషనర్

బోట్‌క్లబ్: నగరంలో పారిశుధ్య పనుల తనిఖీలో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ భావన సోమవారం పలు ప్రాంతాల్లో పర్యటించారు. స్థానిక రామారావుపేట సుబ్బయ్య హోటల్, మోర్ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించారు. రోడ్లు, డ్రైన్లు, చెత్త సేకరణ తీరు తదితర వాటిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య వాహనాల యార్డులో చెత్త తరలింపు వాహనాలను పరిశీలించారు. కమిషనర్ వెంట అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, ఎంహెచ్ఓ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

'సంపద' కేంద్రాల పనితీరు మెరుగుపర్చాలి


పాతర్లగడ్డలో వర్మీ కంపోస్టు తయారీపై అవగాహన కల్పిస్తున్న ఈఓపీఆర్డీ

కరప: పంచాయతీల పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల(ఎస్‌డబ్ల్యూపీసీ) పనితీరును మెరుగుపర్చి, వర్మీ కంపోస్టుతో ఆదాయం సమకూర్చుకోవాలని ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు అన్నారు. పాతర్లగడ్డ, గొర్రిపూడి, కొంగోడు, పెద్దాపురప్పాడు, యండమూరు తదితర గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిత్యం పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. గృహాల వద్దే తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద వర్మీ కంపోస్టు తయారీకి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో స్వమిత్ర సర్వే పనులు, ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేసి, సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. పంచాయతీల కార్యదర్శులు కె.సుధాకర్, పీఎస్ఆర్ బ్రహ్మానందం, పి.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మంచి జీవన శైలితో ఆరోగ్యం పదిలం


కార్యక్రమంలో మాట్లాడుతున్న మల్లీశ్వరి

కాకినాడ రూరల్: వయసు పెరిగే కొద్దీ మంచి జీవనశైలి అలవర్చుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పోషకాహార నిపుణురాలు మల్లీశ్వరి అన్నారు. స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఆరోగ్య అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నిత్యం వ్యాయామం చేయాలని, దురలవాట్లకు దూరంగా ఉండాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. తాజా పండ్లు, ఆకుకూరలు, కాయగూరలు, ధాన్యాలు తీసుకోవాలని, నూనె పదార్థాలు తగ్గించాలని, పీచు పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని వివరించారు. అనంతరం బాడీ అనాలసిస్ చెకప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, డాక్టర్ దాసరి శ్రీధర్, పీవీ రాఘవరావు, ప్రసాద్ నాయుడు, చింతపల్లి సుబ్బారావు, పీవీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

హాకీ పోటీలు కాకినాడకు గర్వకారణం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హరీష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు కాకినాడలో నిర్వహించడం ఈ జిల్లాకు గర్వకారణమని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ తెలిపారు. జిల్లా క్రీడా మైదానంలోని హాకీ కోర్టులో జరుగుతున్న సివిల్ సర్వీసెస్ హాకీ పోటీల్లో భాగంగా సోమవారం నిర్వహించిన మ్యాచ్‌లను ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. భవిష్యత్తులో హాకీ అభివృద్ధికి ఈ టోర్నమెంట్ మైలురాయిగా నిలుస్తుందని చెప్పారు. పోటీల నిర్వాహకులు, హాకీ సంఘ రాష్ట్ర ప్రతినిధి రవిరాజు, రవిచంద్ర పాల్గొన్నారు.


నడకుదురు విఘ్నేశ్వరాలయం వద్ద చెరువు మధ్యలో శివుని విగ్రహం


చిన మామిడాడలోని పంచముఖేశ్వర స్వామి


పెనుగుదురులో బాలాత్రిపుర సుందరి సీతేశ్వరస్వామి


అరట్లకట్టలో భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి


నడకుదురులోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి

శివోహం

- రేపు మహా శివరాత్రి
- ముస్తాబైన శివాలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు


కరపలో శివాలయానికి విద్యుద్దీపాల అలంకరణ


కరపలోని పర్వతవర్థినీ సమేత రామలింగేశ్వరస్వామి


పెద్దాపురప్పాడులో కొలువుతీరిన ఉమాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి

కరప: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆ రోజున పుణ్యస్నానమాచరించి, శివాలయాల్లో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన వంటి పూజలు నిర్వహించి, శివనామ స్మరణ చేయడం పరిపాటి. ఈ సందర్భంగా భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆయా ఆలయ కమిటీలు, దేవదాయ శాఖాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కరప శివాలయానికి 300 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ శివాలయంలోని పర్వత వర్ధినీదేవి సమేత రామలింగేశ్వర స్వామిని దర్శించుకుని, పూజలు చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. మహా శివరాత్రి సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, దర్శనాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఈఓ కె.తిరుమల రవితేజ సోమవారం విలేకరులకు తెలిపారు. బుధవారం తెల్లవారుజాము నుంచి గురువారం సాయంత్రం వరకు పూజాది కార్యక్రమాలు జరుగుతాయని ప్రధానార్చకుడు విలపర్తి శ్రీనివాస్ తెలిపారు. ఆలయానికి రంగులు వేయించి, విద్యుద్దీపాలతో అలంకరించారు. వేళంగి గ్రామానికి చెందిన మెర్ల సూర్యమాంబ నేపాల్ తీర్థయాత్రలకు వెళ్లినప్పుడు పంచముఖాలతో ఉన్న శివలింగాన్ని చూసి, కూరాడ శివారు చిన మామిడాడలోని పంచముఖేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించి, ఐదు ముఖాలతో ఉన్న శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఇక్కడ శివరాత్రికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు వంశపారంపర్య ధర్మకర్త మెర్ల వీరయ్యచౌదరి తెలిపారు.

పురాతన ఆలయం

పెనుగుదురు గ్రామంలోని బాలాత్రిపుర సుందరి సీతేశ్వరస్వామి ఆలయం అతి పురాతనమైంది. ఇక్కడి ఆలయంలో 500 ఏళ్ల క్రితం సీతాదేవిని, స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు గ్రామస్తుల విశ్వాసం. తెల్లవారుజాము నుంచే పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ ప్రధానార్చకుడు భైరవభట్ల సుబ్రహ్మణ్యశర్మ, భైరవభట్ల సాయిరాం తెలిపారు. పెద్దాపురప్పాడులోని ఉమాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు బాదంపూడి భాస్కరవెంకట సుబ్రహ్మణ్యం, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేములవాడలోని భీమేశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా పూజా కార్యక్రమాలు, ఏర్పాట్లను పాట్నీడి వంశీకులు, గ్రామస్తులు పర్యవేక్షిస్తారు. వేములవాడ భీమకవి ఇక్కడే జన్మించినట్టు గ్రామస్తుల ప్రగాఢ విశ్వాసం. కరీంనగర్ జిల్లాలోని వేములవాడ నుంచి భీమకవి వంశీకులు ఇక్కడకు అప్పుడప్పుడూ వచ్చి, శివాలయంలో పూజలు చేస్తారని మాజీ సర్పంచ్, కరప డీసీ మాజీ చైర్మన్ బండే తాతాజీ తెలిపారు. ఈ శివాలయం ఎదురుగా వేములవాడ భీమకవికి ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు, పనులు చురుగ్గా జరుగుతున్నాయని తాతాజీ తెలిపారు.

మల్లెతోటలో శివలింగం

అరట్లకట్టలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం అతి పురాతనమైనది. ఇక్కడ మల్లెతోటలో స్వామివారి శివలింగం దొరకడంతో మల్లేశ్వరస్వామిగా ప్రసిద్ధి చెందారు. శివరాత్రి రోజున తెల్లవారుజాము నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామని అర్చకులు కొంతేటి సత్యనారాయణ, సూర్యదత్త శివకుమార్ తెలిపారు. వేళంగిలోని బాలత్రిపుర సుందరి సమేత భవానీ శంకరస్వామి, నడకుదురులోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి పూజలకు ఏర్పాట్లు చేసినట్టు ఈఓ మోర్త మురళీవీరభద్రరావు తెలిపారు. గురజనాపల్లి, గొర్రిపూడి, వాకాడ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో మహా శివరాత్రి పూజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆయా ఆలయ కమిటీల వారు తెలిపారు. నడకుదురు విఘ్నేశ్వరాలయం వద్ద చెరువులో శివపార్వతుల, శివలింగాకారానికి లైటింగ్ ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవంగా శైవ క్షేత్రాల ముస్తాబు

- తెల్లవారుజాము నుంచే దర్శనానికి ఏర్పాట్లు
- శివాలయాల్లో ప్రత్యేక క్యూలైన్లు


విద్యుత్ వెలుగుల్లో రామారావుపేటలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానం


బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం


దేవాలయం వీధిలో శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన భీమేశ్వరస్వామి ఆలయం

బోట్‌క్లబ్: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలో శివాలయాలను శోభాయమానంగా అలంకరించారు. శివరాత్రి రోజు బుధవారం భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో భారీస్థాయిలో ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని పలు ప్రసిద్ధ శైవక్షేత్రాల్లో క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామికి అభిషేకాలు నిర్వహించేలా ఆయా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. ఆలయం మొత్తం పువ్వులు, మామిడితోరణాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు తెలిపారు. లింగోద్భవ సమయంలో హారతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలోను భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారికి విశేష పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ వీర్రాజు తెలిపారు. స్థానిక రిజర్వు లైన్ అయ్యప్ప స్వామి ఆలయంలో జ్యోతిర్లింగ దర్శనం, మహాశివునికి విశేష అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తెలిపారు. స్థానిక రామారావుపేటలోని సౌమ్య ఎన్‌క్లేవ్‌లో ఉన్న మరకత మణికంఠ పీఠంలో పార్థివ లింగార్చన జరుగుతుందని పీఠం వ్యవస్థాపకుడు నందమూరి వినోద్ తెలిపారు. జగన్నాథపురంలో సర్వేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తినగరంలో శివాలయంతో పాటు, పలు శివాలయాల్లో ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు



"మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి శివాలయానికి ప్రత్యేకాధికారులను, అదనపు సిబ్బందిని నియమించాం. ప్రత్యేక పూజలకు ప్రత్యేక కౌంటర్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశాం. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. దాతలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో భక్తులకు అదనపు సదుపాయాలు కల్పిస్తున్నాం."

– వడ్డి ఫణికుమార్, తనిఖీదారు, దేవదాయ శాఖ

భావ కవితా చక్రవర్తి దేవులపల్లి


దేవులపల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

కాకినాడ రూరల్: మండలంలోని చంద్రపాలెం గ్రామంలో జన్మించిన దేవులపల్లి కృష్ణశాస్త్రి బహుముఖ ప్రజ్ఞ కలిగిన భావ కవితా సామ్రాట్‌గా కీర్తినందుకున్నారని డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు అన్నారు. వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక బోట్ క్లబ్ ఉద్యానవనంలో దేవులపల్లి వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలుగు సాహిత్యంలో భావ కవిత్వం అంటే గుర్తుకొచ్చేది దేవులపల్లి అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శిరీష మాట్లాడుతూ, వక్తగా, కవిగా, భావ కవుల ప్రతినిధిగా దేవులపల్లి కీర్తి ఆర్జించారని కొనియాడారు. కవితలు, గేయ నాటికలు, యక్షగానాలు, లలిత గీతాలు, సినీ గీతాలు, వ్యాసాలు, పిల్లల పాటలతో ఆయన మెప్పించారన్నారు. ఆయన రాసిన కృష్ణపక్షం, ఊర్వశి వంటి కావ్యాలు అఖండ కీర్తిని ఆర్జించాయన్నారు. కళాప్రపూర్ణ, పద్మ విభూషణ్ వంటి పురస్కారాలను దేవులపల్లి అందుకున్నారని తెలిపారు. సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్, శ్రీరాములు, రేలంగి బాపిరాజు, చింతపల్లి సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, రవిశంకర్ పట్నాయక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ తినవచ్చు

డీఎంహెచ్ఓ నరసింహ నాయక్

కాకినాడ క్రైం: నిర్భయంగా చికెన్, కోడిగుడ్లు తినవచ్చని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి నరసింహ నాయక్ తెలిపారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఒక్క బర్డ్ ఫ్లూ కేసు కూడా నమోదు కాలేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో నిరాటంకంగా కోడి గుడ్ల సరఫరా జరుగుతోందని చెప్పారు. ప్రజలకు అవగాహన కోసం పౌల్ట్రీ సంస్థలు చికెన్ మేళాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. 75 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలో చికెన్ వండితే పూర్తి ఆరోగ్యవంతమన్నారు. ఇక్కడి ప్రాంతాల్లో 100–110 డిగ్రీల సెంటీగ్రేడ్ వేడితో చికెన్ వండే అలవాటు ఉందని తెలిపారు. ముడి మాంసం, సగం ఉడికించిన కోడిగుడ్లు, హాఫ్ బాయిల్ ఆమ్లెట్లు తినవద్దని సూచించారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే సత్ఫలితాలు


అరట్లకట్ట హైస్కూలులో విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎం

కరప: విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా, ప్రణాళికాబద్ధంగా చదివితే సత్ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ పి.సత్యనారాయణ అన్నారు. అరట్లకట్టలోని ముత్యాల సుబ్బన్న మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకాన్ని తగ్గించి, చదువుపై ఏకాగ్రత చూపాలన్నారు. జంక్ ఫుడ్ వంటివి తినరాదన్నారు. విద్యార్థుల చదువుపై తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో క్షత్రియ యూత్ ఫెడరేషన్ సమకూర్చిన రూ.20 వేల విలువైన ఎగ్జామ్ ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు, పెన్లను 61 మంది విద్యార్థులకు ఎంఈఓతో పాటు, హెచ్‌ఎం డాక్టర్ పీవీ శివగిరి అందజేశారు. ఎస్ఎంసీ చైర్మన్ దారా వీరబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి చూపిన మహోన్నతుడు గూటెన్ బర్గ్


గూటెన్ బర్గ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

బోట్‌క్లబ్: ప్రింటర్స్ పితామహుడు జోహన్స్ గూటెన్ బర్గ్ ఆవిష్కరించిన మెషీన్ కారణంగా ఎంతో మందికి ఉపాధి దొరికిందని, ప్రింటర్ల మదిలో ఆయన చిరస్థాయిగా నిలిచారని మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోరుమిల్లి బాలప్రసాద్ అన్నారు. ప్రింటర్స్ డే సందర్భంగా జోహన్స్ గూటెన్ బర్గ్ జయంతిని కాకినాడ మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మెజిస్టిక్ వీధిలోని ప్రింటింగ్ సముదాయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గూటెన్ బర్గ్ చిత్రపటానికి ముఖ్యఅతిథి మంత్రిప్రగడ వారి సత్రం ఈఓ సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులర్పించారు. బాలప్రసాద్ మాట్లాడుతూ, సత్యదేవా ప్రింటింగ్ క్లస్టర్ సేవలను ప్రింటర్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రింటర్స్ డే సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు కృష్ణా ఎంపోరియం అధినేత నానాజీ సమకూర్చిన బహుమతులను అందించారు. సంఘ సేవా కార్యక్రమాల్లో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న ప్రింటర్ కార్మికుడికి రూ.25 వేల ఆర్థికసాయం అందించారు. వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జీవీ రావు, జానకిరామ్, పి.శ్రీనివాస్, ఎస్‌బీవీ రమణ, బి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఉమ్రా చేసిన వలీకి కన్నబాబు అభినందన


వలీని సత్కరిస్తున్న మాజీ మంత్రి కురసాల

కాకినాడ రూరల్: మక్కా–మదీనా ఉమ్రా యాత్రను విజయవంతంగా పూర్తి చేసుకున్న వాకలపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, కేజేఎస్ హేచరీస్ అధినేత వలీని మాజీ మంత్రి, పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజినల్ కో–ఆర్డినేటర్ కురసాల కన్నబాబు అభినందించారు. స్థానిక రమణయ్యపేట వైద్యనగర్ నివాసంలో సోమవారం కన్నబాబును వలీ కలిసి, ప్రసాదం అందజేశారు. అల్లాహ్ దీవెనలు అందరికీ ఉండాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా వలీని శాలువాతో కన్నబాబు సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు కరీం బాషా, పార్టీ నాయకులు గోపిశెట్టి బాబ్జీ, పుల్ల చందు, బండారు వెంకటేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దాపురం: పట్టణంలో పేకాట శిబిరంపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో ముగ్గురిని అరెస్టు చేసినట్టు ఎస్సై మౌనిక సోమవారం సాయంత్రం తెలిపారు. ఈ దాడిలో రూ.10,250 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

విద్యతోనే పిల్లల భవిష్యత్తు


జ్యోతి ప్రజ్వలన చేసి వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: నగరంలోని జగన్నాథపురంలో ఉన్న ఆదిత్య పాఠశాలలో 35వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథి కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ ఎం.మురళీధర్ మాట్లాడుతూ, పిల్లల భవిష్యత్తుకు విద్యే ఆధారమన్నారు. గౌరవ అతిథి డాక్టర్ అలేఖ్య, హెచ్‌ఎం బి.సుప్రజరాణి వివిధ విషయాలపై మాట్లాడారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి మాట్లాడుతూ, ఒకప్పుడు ఇదే విద్యాసంస్థలో చదివిన విద్యార్థులు ఇప్పుడు వివిధ రంగాల్లో మంచి స్థాయిని పొందారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ఘనంగా మహిమ దినోత్సవం

కాకినాడ రూరల్: శ్రీలహరి కృష్ణ మహిమ దినోత్సవాన్ని స్థానిక సర్పవరం జంక్షన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. శ్రీలహరికృష్ణ జన్మదినం, శ్రీలహరికృష్ణ వైకుంఠంలో ప్రవేశించిన దినం కావడంతో ఈ రోజును మహిమ దినోత్సవంగా ఆచరిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఫణీశ్వరరావు, సోషల్ వర్కర్ అహమ్మద్, కాకినాడ సేవ సమితికి చెందిన శ్రీను, కాంట్రాక్టర్ ఎన్.శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మనుజ్యోతి ఆశ్రమాన్ని సందర్శించి పావనులు కావాలని వారు పేర్కొన్నారు. బ్రదర్ తిమోతి, బ్రదర్ ప్రభాకర్, మూర్తి, రమణ, రాంబాబు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి వాహనాలు నడిపిన కేసుల్లో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ డి.శ్రీదేవి సోమవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్లలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదయ్యాయి. నిందితులను కోర్టులో హాజరుపర్చగా, 9 మందికి మూడు రోజులు, నలుగురికి ఐదు రోజుల చొప్పున జైలు, పది మందికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

సుందర్‌కు మద్దతుగా ప్రచారం


వేళంగిలో ప్రచారం చేస్తున్న రచయిత రాజేష్

కరప: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్‌కు మద్దతుగా శనివారం ఎస్సీ మండల నాయకులు ప్రచారం చేశారు. వేళంగిలో రచయిత సవిలే రాజేష్ గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి, స్వతంత్ర అభ్యర్థి సుందర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎస్సీ నాయకులు వజ్రపు కామేశ్వరరావు, మారెళ్ల వెంకటరమణ, సాదే లోహిదాస్ తదితరులు కరప, వాకాడ, వేములవాడ, పెద్దాపురప్పాడు తదితర గ్రామాల్లో పర్యటించారు.

విద్యార్థులపై తీవ్రంగా సినిమాల ప్రభావం

పెద్దాపురం: సమాజంలో విద్యార్థులపై సినిమాల ప్రభావం ఎక్కువగా ఉందని ఎస్సై మౌనిక అన్నారు. సినిమాలు వేరు, నిజ జీవితం వేరనే విషయం ప్రతి విద్యార్థి గ్రహించాలన్నారు. మండలంలోని ఆర్‌బీ పట్నం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం విద్యార్థులకు పలు అంశాలపై కౌన్సెలింగ్ ఇచ్చారు. హెచ్‌ఎం మల్లేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఎస్సై మౌనిక మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి హెయిర్ స్టైల్ సాధారణంగా ఉండాలని, చింపురు జుట్టు, ఫ్యాషన్ పేరిట మోడల్ కటింగ్స్‌తో తమ జీవితాలను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. చాలా మంది విద్యార్థులు ఆకతాయితనంతో ప్రవర్తిస్తున్నారన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్	జాబిలమ్మ నీకు అంత కోపమా, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్
దేవి మల్టీప్లెక్స్	బాపు, జాబిలమ్మ నీకు అంత కోపమా, రామం రాఘవమ్, తండేల్
లక్ష్మి	బ్రహ్మ ఆనందం
సత్యగౌరి	రామం రాఘవమ్
తిరుమల	సంక్రాంతికి వస్తున్నాం
సీఅండ్‌సీ–1	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సీఅండ్‌సీ–2	లైలా
పద్మప్రియ	తండేల్
శ్రీప్రియ	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్